క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



దంతాలపల్లి: మండలంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ రమాదేవి శనివారం సందర్శించారు. ఈసందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి, పల్లెప్రకృతి, నర్సరీల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం అందజేత



గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతన దర్మసత్రం నిర్మాణంకు దాత ఆశ్వాపురం వేణుమాధవ్ రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో దాత బంధువులు, పుల్లఖండం రమేష్‌బాబు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ బి అమర్‌చంద్, అర్చకులు అచ్చుత్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గౌడల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మహబూబాబాద్: గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శనివారం తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్నను ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. గౌడ కులస్తులందరూ కలిసి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకన్నను ఎన్నుకున్నందుకు వారి నమ్మకంను ఒమ్ము చేయకుండా సమస్యలపై ఉద్యమించాలన్నారు. సమ్మెట వెంకన్న, వెంకన్న, రవి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత



డోర్నకల్: డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సాంపంగి సోదరులు రియల్ ఎస్టేట్ రంగంలో రాణించి జాతీయ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం నేషనల్ అచీవర్స్ రికగ్నేషన్ ఫోరం సంస్థ ఢిల్లీ కాన్సిట్యూషన్‌క్లబ్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో విధానసభ స్పీకర్, ఎరాంనివాస్ గోయ్, సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ రాజ్‌కుమార్ ఆనంద్ చేతుల మీదుగా సాంపంగి సోదరులు రమేష్, సురేష్ పురస్కారాలు అందుకున్నారు.

జలాభిషేకం



కురవి: మండల కేంద్రంలో గౌడకులస్తుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామికి శనివారం బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం బోనాలు సమర్పించుకున్నారు. కుల పెద్దలు కత్తి రమణాకర్, కత్తి వెంకన్న, బండారి మహేష్ పాల్గొన్నారు.

ఈ శ్రమ్ కార్డులు తీసుకోవాలి



మహబూబాబాద్ రూరల్: కార్మికులు విధిగా ఈశ్రమ్ కార్డులు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిటీ హమాలీ వర్కర్లతో జిల్లా కేంద్రంలో 'అసంఘటిత కార్మికులకు చట్టపరమైన సేవలు' అనే అంశంపై శనివారం జరిగిన న్యాయ చైతన్య సదస్సులో జడ్జి మాట్లాడారు. భవిష్యత్‌లో ఈ కార్డు ద్వారా కార్మికులు అనేక ప్రయోజనాలు పొందవచ్చని, మీ దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్‌లోకి వెళ్లి ఆధార్ కార్డుతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్మికులు సహకరిస్తే కోర్టులోనే సెంటర్ ఏర్పాటు చేసి ఈ శ్రమ్ కార్డులు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి రమేష్, సిటీ హమాలీ కార్మిక సంఘం తరఫున చిత్తారి లింగయ్య, లైజన్ ఆఫీసర్ సంపత్ రెడ్డి ఈ శ్రమ్ కార్డు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

వసతులు ఫుల్.. వైద్యులు నిల్..!

- 30 పడకల ఆస్పత్రిగా పేరు..
- 16మందికి వైద్యులకు గాను నలుగురే..
- ప్రశ్నార్థకంగా సర్కార్ వైద్యం

గూడూరు: మండల కేంద్రంలో గూడూరు, కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాలకు పెద్ద దిక్కుగా నెలకొన్న సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలాయన్న సందేహాన్ని ఈ ప్రాంత వాసులు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏజెన్సీ గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో భారీ భవన సముదాయంతోపాటు అవసరమైన అన్నిరకాల మెడికల్ ఇక్విప్‌మెంట్ వసతులు కల్పించారు. కోవిడ్ ముందు, తరువాత ఈ ఆస్పత్రిలో కలెక్టర్ చొరవతో ఐసీయూ యూనిట్ కాగా, ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈసీజీ, ఎక్స్‌రే, స్కానింగ్ వంటి సౌకర్యాలు కూడా కల్పించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా వైద్యులు పనిచేస్తుండడంతో ప్రసవాల సంఖ్య పెరిగింది. 30పడకల సీహెచ్‌సీగా పేరుగాంచిన ఈ ఆస్పత్రిలో 16 మంది వైద్యులతో కూడిన స్టాఫ్ మెనూ పనిచేయాలి. వారిలో వివిధ వైద్య విభాగాలకు సంబంధించి 4గురు డిప్యూటీ సివిల్ సర్జన్లు, 8 మంది సివిల్ అసిస్టెంటు సర్జన్లు, ఒక డెంటల్ అసిస్టెంట్ సర్జన్ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. కానీ 10 సంవత్సరాలుగా ఈ సీహెచ్‌సీలో అవసరమైన రెగ్యులర్ ప్యాట్రన్ ఏర్పాటు చేయకపోవడంతో కాంట్రాక్ట్ బేసిక్‌లో వైద్యులు విధులు నిర్వహిస్తూ, వారి అవసరాలను బట్టి కౌన్సెలింగ్‌లో పదోన్నతులు, ఉన్నత విద్య కోసం ఆస్పత్రిని విడిచి తిరిగి వెళ్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఒక సూపరింటెండెంట్‌తోపాటు ముగ్గురు డాక్టర్లు, ఒక డెంటల్ పనిచేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి ఏజెన్సీ వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గూడూరులో సీహెచ్‌సీ భవన సముదాయం

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఏజెన్సీ మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వసతులకు అనుగుణంగా వైద్యులను నియమించాలి. వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఈసం సంధ్యారాణి, సర్పంచ్, మట్టెవాడ

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..



సీహెచ్‌సీలో అన్ని హంగులతో కూడిన సదుపాయాలు ఉన్నాయి. వైద్యుల కొరత విషయం వాస్తవమే. వైద్యుల కొరతపై జిల్లా కలెక్టర్, డీసీహెచ్‌ఓ దృష్టికి తీసుకువెళ్లాం. వైద్యుల నియామకంపై ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలి.

– డాక్టర్ వీరన్న, సూపరింటెండెంట్, గూడూరు

నేటినుంచి 'పల్లెపల్లెకు బీఆర్‌ఎస్'

కురవి: నేటినుంచి దంతాలపల్లి మండలం నుంచి పల్లెపల్లెకు, తండాతండాకు, గ్రామగ్రామానికి బీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సీరోలు, కురవి మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాబోయేది ఎన్నికల కాలమని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి మూడో సారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. డోర్నకల్‌లో తానే పోటీ చేస్తానని, గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తోటలాలయ్య, ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవినాయక్, రామనాథం, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

అనుమతులు లేని విత్తనాలు విక్రయించొద్దు



కొత్తగూడ: తనిఖీ చేస్తున్న ఎస్సై నగేష్

కొత్తగూడ: అనుమతులు లేని విత్తనాలు, పురుగు మందులను విక్రయించవద్దని ఎస్సై నగేష్ సూచించారు. శనివారం మండలకేంద్రంలోని విత్తనాల షాపులను వ్యవసాయ శాఖ, పోలీస్‌శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. లైసెన్స్‌లు, బిల్లు బుక్కులు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా చూసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏఓ ఉదయ్, ఏఈఓ రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

పెద్దవంగర: ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఏఓ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఎస్సై రాజుతో కలిసి తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ, పోలీస్ అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

లారీలు లేక రైతుల ఇబ్బందులు

కురవి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, కన్నె వెంకన్న, అప్పాల వెంకన్న పాల్గొన్నారు.



కురవి: ధాన్యం పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మరిపెడ: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రైతులు నెలల తరబడి ధాన్యాన్ని కేంద్రాల్లో ఉంచితే అవి కొనడానికి ప్రభుత్వం సుముఖంగా లేకపోవడం విచారకరమన్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాటికొండ అనంతచారి, దేవయ్య, ఉప్పలయ్య ఉన్నారు.

బాస్కెట్ బాల్ జిల్లాస్థాయి ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 22న సోమవారం మధ్యాహ్నం 3గంటలకు 16 సంవత్సరాల లోపు బాలబాలికలకు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ ముల్లంగి ప్రతాపరెడ్డి శనివారం తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, ప్రభుత్వం జారీ చేయబడిన జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక చేయబడిన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27 తేదీల్లో సూర్యాపేట జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి యూత్, అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు బాస్కెట్ బాల్ కోచ్ వెలిశాల కుమార్ స్వామిని సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కేసముద్రం/మహబూబాబాద్/నెల్లికుదురు /మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేసముద్రంలో పార్టీ కార్యాలయంలో మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పేరున తయారు చేయించిన పాటల సీడీని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, కముటం శ్రీనివాస్, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సట్ల వెంకన్న, సట్ల శ్రీనివాస్, రడం శ్రీనివాస్, తోట శ్రీనివాస్, ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, మాసాడి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో స్థానిక ఐఎంఏ హాల్‌లో రక్తదాన శిబిరంతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు నగదు అందజేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, జెడ్పీటీసీ ప్రియాంక, మార్నెని వెంకన్న, యాళ్ల మురళీధర్ రెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు. నెల్లికుదురు, మహబూబాబాద్ రూరల్‌లో జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.



కేసముద్రం: ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పాటల సీడీని అందజేస్తున్న నీలం దుర్గేష్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన కందుకూరి శంకర్ అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు కేసముద్రంవిలేజ్‌కి చెందిన జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, కముటం శ్రీనివాస్, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సట్ల వెంకన్న, సట్ల శ్రీనివాస్, రడం శ్రీనివాస్, తోట శ్రీనివాస్, ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, మాసాడి శ్రీనివాస్ కలిసి, మృతుడి కుమారుడి పేరా జమచేసిన రూ.35వేల ఫిక్స్‌డ్ బాండ్‌ను శనివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం తాళ్లపూసపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ నేత డాక్టర్ మురళీనాయక్ పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కిసాన్‌సెల్‌జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సదస్సును జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 23న మండలంలోని వినోభానగర్‌లో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని పార్టీ గ్రామ కార్యదర్శి సదానందం శనివారం పిలుపునిచ్చారు.

గొర్రెలు పంపిణీ చేయాలి

బయ్యారం: 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి గొర్రెలను పంపిణీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు దూదిమెట్ల మోహన్ రావుయాదవ్, నీలారపు సంపత్‌యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట చేయతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో లింగయ్య, శ్రీను, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కురవి: ఎమ్మెల్యే శంకర్‌నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని శంకర్‌నాయక్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి ఆయనను సత్కరించారు.

బొడ్రాయి వేడుకలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం లచ్చతండా గ్రామ పంచాయతీ పరిధిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా శనివారం మొదటి రోజు గణపతిపూజ పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, రక్షాబంధనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ట, మూలమంత్రహవణములు వంటి పూజలు నిర్వహించారు.

క్షీరాభిషేకం

నెల్లికుదురు: సుమారు 23వేల మంది వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని తీర్మాణం చేయడాన్ని హర్షిస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల జేఏసీ అధ్యక్షుడు భాస్కర్, రహెమాన్, వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లిలో క్షుద్ర పూజల కలకలం రేపాయి. ఉగ్గంపల్లి నుంచి మరిపెడ(బంగ్లా) వెళ్లే ప్రధాన రహదారిపై క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు దర్శనమిచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి తెల్లటి గుడ్డ మూటలో కానరాని వస్తువులను కట్టి రోడ్డుపై పడేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇలాంటి సంఘటన జరగడంతో అటుగా ప్రయాణించాలంటేనే వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టి, క్షుద్రపూజల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పరామర్శ..

నెల్లికుదురు: చెన్నైలో రోడ్డు ప్రమాదంలో శుక్రవారం ఉదయం మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన గోరంట్ల భద్రయ్య (52) మృతి చెందాడు. మృతి చెందిన భద్రయ్య గాయిత్రి గ్రానెట్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం భద్రయ్య మృతదేహాన్ని సందర్శించి బోరున విలపించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నాడు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, మర్రి రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ టీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతి కుమార్, బీజేపి జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొన్నారు.

ఎరుకల సంక్షేమానికి కృషి చేయాలి

తొర్రూరు: ఎరుకల సామాజికవర్గ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎరుకల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నడిగడ్డ శైలజ భర్త యాదగిరి, కుమార్తె శివానీల ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎరుకల సంఘం సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా వెనకబాటుతనాన్ని అనుభవిస్తున్న ఎరుకల కులస్తులకు ప్రత్యేక వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయపురం సంపత్, శ్రీనివాస్, కూతాటి సంపత్, తోట ఎల్లేష్; మాదగాని వెంకన్న, సోమయ్యలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి


కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కు ఆసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు.

గుండెపోటుతో కరాటే మాస్టర్ మృతి



కొత్తగూడ: ఎందరో ఆదివాసీ విద్యార్థులను కరాటే విద్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కరాటే మాస్టర్ ఎర్ర శ్రీకాంత్(35) శనివారం మృతి చెందారు. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ షోటోకాన్ కరాటే విభాగంలో బ్లాక్ బెల్ట్ సాధించిన అనంతరం గిరిజన సంక్షేమ గురుకులాల విద్యార్థులకు కరాటే ప్రాముఖ్యతను వివరిస్తూ నేర్పించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బీఆర్‌ఎస్ ములుగు జిల్లా నాయకుడు గోవింద్‌నాయక్ శ్రీకాంత్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబానికి దళితబంధు ఇప్పించి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జాతీయ కమిటీ సభ్యుడిగా విమల్‌కుమార్ జైన్



గార్ల: మైనారిటీ జాతీయ కమిటీ సభ్యుడిగా గార్లకు చెందిన రావుకా విమల్‌కుమార్‌జైన్ నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం ఆయన తన నియామక పత్రాన్ని మైనారిటీ జాతీయ కమిటీ నాయకురాలు సయ్యద్ షెహజాదీ చేతుల మీదుగా అందుకున్నారు. నియమితులైన విమల్‌కుమార్‌జైన్‌ను గార్ల మండల బీజేపీ అధ్యక్షులు జశ్వంత్ ఠాగూర్, నాగరాజు తదితరులు అభినందించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో సుమారు రూ.7కోట్ల నిధులతో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ శనివారం నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2.19కోట్లతో బీటీ రోడ్డు, నర్సింహులగూడెంలో రూ.1.5కోట్లతో 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్, కోటితో బీటీ రోడ్డు పనులకు, కాస్య తండాలో రూ.16లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సారంపెల్లి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నరేష్, బీముడు, ఉప్పలయ్య, బుజ్జి వెంకన్న పాల్గొన్నారు.

గూడూరు: ప్రజాభిమానం, సీఎం కేసీఆర్ అండతోనే తాను అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మట్టెవాడలో, శ్రీహనుమాన్‌తండాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి, ఊట్లలో జీపీ నూతన భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటక్రిష్టారెడ్డి, ఎంపీపీ బానోతు సుజాత, జెడ్పీ కోఆప్షన్ ఎండి. ఖాసీం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, సురేందర్, కతార్‌సింగ్, సమ్మక్క, సర్పంచ్‌లు సంధ్యారాణి, జ్యోతి, రాజు, ఎంపీటీసీ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



నెల్లికుదురు: బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భరోసా కేంద్రం ద్వారా సేవలు



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: భరోసా కేంద్రం ద్వారా బాధితులకు న్యాయపరమైన సేవలు అందిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లాలో భరోసా కేంద్రాన్ని స్థాపించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా శనివారం కేక్ కట్ చేసి సిబ్బందికి అభినందనలు తెలిపారు. బాధిత మహిళలు, బాలికలకు భరోసా కేంద్రం అండగా ఉంటుందని అన్నారు. మహిళలు, బాలల రక్షణకు సత్వర సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. భరోసా సెంటర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వివిధ కేసులలో అందించిన సహాయ, సహకారాలు, విచారణ చేసిన కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా పోక్సో, అత్యాచారం కేసులు నమోదు కాగానే బాధితులను నేరుగా భరోసా కేంద్రానికి తీసుకొచ్చి వారికి భరోసా ఇవ్వాలని సూచించారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం ఇప్పించడానికి వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ కోరారు. బాధితులు డయల్ 100 లేదా భరోసా సెంటర్ ఎస్సై 87126 56936, కార్యాలయ నంబర్ 73822 60111కు ఫోన్ చేసి సహకారం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, సీఐ రవికుమార్, సీఐ సతీష్, ఎస్సై దీపిక, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తొర్రూరు: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రీయూజ్, రిడ్యూస్, రీసైకిల్ కేంద్రంను చైర్మన్ ప్రారంభించారు. పట్టణ ప్రజలు పాత దుస్తులు, సీసాలు, కాగితాలతో పాటు ఇంట్లో వాడేసిన వస్తువులు ట్రిబుల్ ఆర్ కేంద్రాల్లో అందజేయాలన్నారు. జూన్ 5వరకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ఏఈ రంజిత్, ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్ కొలుపుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పాత పుస్తకాలు అందజేస్తున్న చిన్నారులు

విద్యాభివృద్ధికి సహకరిస్తాం

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సహకరిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పాటి రమేష్ తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో శనివారంక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ విత్తనాల సుధాకర్, శిబిరం ఇన్‌చార్జ్‌లు ఆంగోత్ లక్ష్మా, సీతారాములు, ఉపాధ్యాయులు డేవిడ్, మాధవరావు, గోవర్ధన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

మహబూబాబాద్ రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం 34వ రోజుకు చేరుకుంది. సమ్మెలో సంఘం మండల అధ్యక్షురాలు కృష్ణవేణి, రోజా, శోభ, అరుణ పాల్గొన్నారు.

వర్ష బీభత్సం..

కొత్తగూడ: కొత్తగూడ ఏజెన్సీలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి వానతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. దీంతో ధాన్యం తడిసినట్లు రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి మండలంలో అంధకారం అలుముకుంది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

తొర్రూరు: మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో చెట్టు విరిగిపడింది. ఈదుర గాలుల కారణంగా విద్యుత్ సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేశారు. తొర్రూరు మార్కెట్ యార్డు, మడిపల్లి, అమ్మాపురం, వెలికట్ట తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొంత మేర తడిసింది. మామిడి తోటల్లోని కాయలు నేలరాలాయి.



తొర్రూరు వ్యవసాయ మార్కెట్ సమీపంలో నేలకూలిన చెట్టు